సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం। 12। ఏప్రిల్। 2023



అందని సూపర్ స్పెషాలిటీ వైద్యం

జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్యం అంతంతమాత్రమే. రాత్రి వేళల్లో ఏదైనా ప్రమాదం జరిగితే వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. 8లో



డిగ్రీ విద్యార్థులకు మెరుగైన బోధన

గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో మెరుగైన బోధన అందించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం సూర్యప్రతాపం అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత మరింతగా నమోదవుతుంది. వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

యూనిసెఫ్ బుక్ రేసులో 'బండారుగూడెం'

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం, యూనిసెఫ్ సౌజన్యంతో జాతీయస్థాయిలో ప్రచురించే పుస్తకంలో తెలంగాణ నుంచి బండారిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రథమ రేసులో నిలిచింది. ఈ మేరకు యూనిసెఫ్ బాధ్యులు హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావుకు మంగళవారం సమాచారం అందించారు. యూనిసెఫ్ టీం, కేంద్ర అధికారులు త్వరలోనే పాఠశాలను సందర్శించి సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమరిస్తారని తెలిపారు. పాఠశాల స్థితిగతులను పరిశీలించనున్న అధికారులు.. ఆ తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్ తదితరులను కలిసి చర్చిస్తారని తెలిసింది.

బీఈడీ కళాశాల సందర్శన

భద్రాచలంటౌన్: పట్టణంలోని మదర్ థెరిసా బీఈడీ కళాశాలను మహారాష్ట్రకు చెందిన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ అండ్ సైన్స్ బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. జాతీయ విద్యా ప్రణాళిక చట్టం స్టడీ సర్వేలో భాగంగా అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. కళాశాలలో పరిపాలన విధానం, బోధన అంశాలు, బోధన సామగ్రి, తరగతి గదుల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నాగుల రమేష్, తోటమళ్ల వెంకటరమణ, విజయమోహన్ పాల్గొన్నారు.

చైర్మన్.. ఫ్లోర్‌లీడర్ బాహాబాహీ

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు – మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ కొక్కు నాగేశ్వరరావు మధ్య వివాదం నెలకొంది. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్మన్ పలు అంశాలపై సమీక్షించారు. అయితే, కౌన్సిలర్ల కోసం ఏర్పాటుచేసిన కుర్చీల్లో పారిశుద్ధ్య సిబ్బందిని కూర్చోబెట్టిన అంశంపై ఫ్లోర్ లీడర్ అభ్యంతరం చెబుతూ రాత్రి ఎమ్మెల్యే భర్త, హరిసింగ్ దగ్గరకు వెళ్లి మాట్లాడినట్లు తెలిసింది. దీంతో హరిసింగ్, నాగేశ్వరరావు కలిసి రాత్రి పొద్దుపోయాక చైర్మన్ డీవీ ఇంటికి వెళ్లారు. అక్కడ చర్చించే క్రమంలోనే ఇటీవల బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్సీ తాతా మధు రావటాన్ని నాగేశ్వరరావు ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో మాటామాట పెరిగి డీవీ, నాగేశ్వరరావు నడుమ తోపులాట జరిగే క్రమంలో ఆయనపై డీవీ చేయి చేయిచేసుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న మిగతా కౌన్సిలర్లు కూడా చేరుకుని ఇరువర్గాలుగా పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై చైర్మన్‌ను వివరణ కోరగా చిన్న చర్చ జరిగిందని, అయినా అర్ధరాత్రి తన ఇంటికి రావటం తప్పు కాదా అని అన్నారు.

పట్టాలెక్కని బెళగావి

కొల్హాపూర్ స్థానంలో కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

- ఈ ఏడాది జనవరి 11న ఉత్తర్వులు జారీ
- వారం తిరక్కుండానే రైల్వే శాఖ వెనకడుగు
- మూడు నెలలు గడిచినా ఉలుకూ పలుకూ లేదు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మణుగూరు – బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించడంపై రైల్వే శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఈ రైలుకు సంబంధించిన షెడ్యూల్, ప్రారంభ తేదీలను రైల్వే అధికారులు ప్రకటించారు. కానీ చివరి నిమిషంలో ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. ఇప్పటికి మూడు నెలలు గడిచినా ఈ రైలు ప్రారంభోత్సవం విషయంలో ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి గతంలో ప్రతీ రోజు మూడు రైళ్లు నడిచేవి. రాత్రి వేళలో మణుగూరు సూపర్ ఫాస్ట్, కాకతీయ ప్యాసింజర్ రైళ్లు అందుబాటులో ఉండగా మధ్యాహ్నం మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉండేది. ఇందులో కాకతీయ, సూపర్‌ఫాస్ట్ రైళ్లు సికింద్రాబాద్ వరకు ఉండగా మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండే లింగంపల్లి మీదుగా వెళ్లేది. దీంతో రాష్ట్ర రాజధాని నుంచి జిల్లాకు వచ్చే వారికి, ఇక్కడి నుంచి వెళ్లేవారికి ఈ రైలు ఎంతో అనుకూలంగా ఉండేది. కరోనా సంక్షోభ సమయంలో ఈ రైళ్లన్నీ రద్దయ్యాయి. ఆ తర్వాత క్రమంగా మణుగూరు సూపర్‌ఫాస్ట్, కాకతీయ ఎక్స్‌ప్రెస్ పునః ప్రారంభం అయినా.. కొల్హాపూర్ రైలు మాత్రం పట్టాలు ఎక్కలేదు.

కొత్త రైలుకు ఉత్తర్వులు..

మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును పునః ప్రారంభించాలనే డిమాండ్ నలువైపులా పెరిగిపోవడంతో ఈ ఏడాది ఆరంభంలో రైల్వేశాఖలో కదలిక వచ్చింది. కొల్హాపూర్ రైలు స్థానంలో మణుగూరు – బెళగావి రైలును ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఈ ఏడాది జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసింది. అదే నెల 17వ తేదీ నుంచి రైలును ప్రారంభించేందుకు అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ అనూహ్యంగా జనవరి 15న ఈ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించే విషయంలో రైల్వేశాఖ వెనక్కు తగ్గింది. బెళగావి ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తూ మరో సర్క్యులర్ జారీ చేసింది.

సరుకు రవాణాపై దృష్టి..

కరోనా సంక్షోభ సమయం తర్వాత సరుకు రవాణాపై రైల్వేశాఖ ఫోకస్ పెంచింది. ఈ విషయంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం ఎంతో కీలకం. దీంతో జనవరి నుంచి మార్చి వరకు బొగ్గు రవాణాపై రైల్వే శాఖ దృష్టి సారించింది. ఇదే సమయంలో సత్తుపల్లి – భద్రాచలంరోడ్ మధ్య కొత్త రైల్వేలైన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ఒక్కసారిగా గూడ్సు రైళ్ల ద్వారా బొగ్గు రవాణా ఊపందుకుంది. ఇలా భద్రాచలంరోడ్ – డోర్నకల్ – కాజీపేట మార్గంలో బొగ్గు రవాణా చేసే గూడ్సు రైళ్ల సంఖ్య పెరిగింది. అయితే భద్రాచలం రోడ్ – డోర్నకల్ సెక్షన్ సింగిల్ లైన్‌గా ఉంది. ఒకే సమయంలో ఇటు సరుకు రవాణా, అటు ప్రయాణికుల రైళ్లు ప్రవేశపెట్టడం ఇబ్బందిగా మారింది. దీంతో సరుకు రవాణాకు ప్రాధాన్యత ఇస్తూ మణుగూరు – బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసినట్టు సమాచారం.

ప్రజావసరాలు పట్టవా..?

మణుగూరు – బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవంపై తొలి సర్క్యులర్ 2023 జనవరి 11న జారీ అయింది. వారం కూడా గడవక ముందే జనవరి 15న రైలు ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం వెలువడింది. పాత ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత రైలు ప్రారంభోత్సవం విషయంలో కదలిక వస్తుందనే నమ్మకం ఇన్నాళ్లుగా జిల్లా వాసుల్లో ఉండేది. కానీ రైలు ప్రారంభోత్సవం వాయిదా పడి మూడు నెలలు గడిచినా నేటికీ రైల్వే శాఖ నుంచి ఉలుకూ పలుకూ లేదు. బొగ్గు రవాణా ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం తెచ్చిపెడుతున్నా.. ఇక్కడి ప్రజల అవసరాలు తీర్చడంపై మాత్రం దృష్టి సారించడం లేదనే అపవాదు రైల్వేశాఖపై అపవాదు వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

అణగారిన వర్గాలకు అక్షరజ్యోతి.. పూలే

జయంతి వేడుకల్లో కలెక్టర్ నివాళి



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అణగారిన వర్గాలకు అక్షరజ్యోతిలా మారిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని పూలే భావించారని, అక్షరాలను ఆయుధంగా చేసుకుని అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు విద్యాబుద్ధులు నేర్పించి ఉపాధ్యాయురాలిని చేశారని అన్నారు. విలువలకు కట్టుబడి దేశానికి, సమాజానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం కృషి చేశారని అన్నారు. ప్రపంచ మేధావి అయిన డాక్టర్ అంబేద్కర్.. పూలేను తన గురువుగా పేర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమాధికారి సురేందర్, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావు, సభ్యులు మాడిశెట్టి శ్రీనివాసరావు, శంకర్, కిషోర్, రాజేశ్వరి, కె సత్యనారాయణ, బండి రాజుగౌడ్, భూపతి శ్రీనివాసరావు, కట్కూరి రవి, కె రామాచారి, గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అగ్రస్థానం

సమష్టి కృషితోనే రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులో ప్రథమస్థానంలో నిలిచామని కలెక్టర్ అనుదీప్ అన్నారు. పామాయిల్ మొక్కలు నాటే లక్ష్యం సాధించిన సందర్భంగా ఐడీఓసీలో ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్‌ఫెడ్ అధికారులు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి ప్రగతి నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. సంప్రదాయ పంటల సాగుతో భూసారం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుందని, రైతులకు ఆదాయం కూడా రాదని అన్నారు. అందుకే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తూ సత్ఫలితాలు సాధించామని చెప్పారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది 16,135 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 16,508 ఎకరాల్లో నాటి, బిందు సేద్య సౌకర్యం కూడా కల్పించామని వివరించారు. అనంతరం సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన దుమ్ముగూడెం మండలానికి చెందిన పెనుబల్లి గంగరాజును కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఏడీఏలు రవికుమార్, లాల్‌సింగ్, ఉద్యాన అధికారులు శాంతిప్రియ, సందీప్, పర్యవేక్షకులు విజయ్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ అధికారులు అకుల బాలకృష్ణ, అప్పారావు, రాధాకృష్ణ, డ్రిప్ కోఆర్డినేటర్లు నరసింహారావు, వినయ్, బాలాజీ, రఫీ, సుబ్బారావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా 'బాలసాని'



భద్రాచలం: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలకు భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసాని లక్ష్మీనారాయణను నియమిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ప్రకటించారు. రెండు రోజుల క్రితం మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితను నియమించగా, ఆమె అభ్యర్థన మేరకు తిరిగి బాలసానికి ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, బాలసాని లక్ష్మీనారాయణ నియామకం పట్ల పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

లెక్క తేలింది..

- జిల్లాలో 1,435 ఎకరాల్లో పంటలకు నష్టం
- బాధిత రైతులు 2,055 మంది
- 33 శాతం నిబంధనతో తగ్గిన 1,164 ఎకరాలు..



ఇటీవలి అకాల వర్షాలతో ధ్వంసమైన బొప్పాయి తోట

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలతో జిల్లాలో వాటిల్లిన పంట నష్టం లెక్క తేలింది. మొత్తం ఐదు రకాల పంటలకు సంబంధించి 2,055 మంది రైతులకు చెందిన 1435.10 ఎకరాల్లో నష్టం జరిగిందని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు ప్రకటించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారులు జిల్లాలో సర్వే నిర్వహించారు. మొదట చేపట్టిన ప్రాథమిక సర్వేలో జిల్లాలోని 11 మండలాల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులకు 1,472 మంది రైతులకు సంబంధించిన 2,599 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పెసర, మినుము, పొగాకు, జొన్న పంటలకు నష్టం జరిగిందని వెల్లడించారు. అయితే పండించిన పంటలో 33 శాతం మేర దెబ్బ తింటేనే నష్టంగా పరిగణనలోకి తీసుకోవాలని నిబంధనల నేపథ్యంలో నిర్వహించిన సర్వేలో మొదటి అంచనా కంటే 1164 ఎకరాలు తగ్గాయి.

మొక్కజొన్నకే అధిక నష్టం..

జిల్లాలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో మొక్కజొన్న పంటకే అత్యధికంగా నష్టం వాటిల్లింది. 1,891 మంది రైతులకు సంబంధించిన 1295.31 ఎకరాల్లో ఈ పంట దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక 150 మందికి చెందిన 124.03 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందని సర్వేలో తేల్చారు. ఆరుగురు రైతులకు సంబంధించిన మూడెకరాల్లో పెసర, ఇద్దరు రైతులకు చెందిన 1.20 ఎకరాల్లో జొన్న, ఆరుగురు రైతులకు చెందిన 10.36 ఎకరాల్లో బొప్పాయి పంటలకు నష్టం జరిగినట్లు ఉద్యాన అధికారులు గుర్తించారు.

2,055 మందికి పరిహారం..

నష్టపోయిన పంటల పరిశీలన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలోని 2,055 మంది రైతులకు వారు నష్టపోయిన పంటల ఆధారంగా బ్యాంక్ ఖాతాల్లో పరిహారం జమ కానుంది. జిల్లా వ్యాప్తంగా 1435 ఎకరాలకు సంబంధించి రూ.1,43,50,000 పరిహారం అందనుంది. ఇదిలా ఉండగా.. ఈనెల ప్రారంభంలో మరోసారి దెబ్బతిన్న పంటలకు సంబంధించిన సర్వే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

క్షేత్రస్థాయిలో సర్వే చేశాం



అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు సంబంధించిన పంటలను క్షేత్రస్థాయిలో సర్వే చేశాం. జిల్లా కలెక్టర్ కూడా స్వయంగా పంట నష్టాలను పరిశీలించారు. నష్టం నివేదికలను కలెక్టర్‌కు అందజేశాం.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

నిబంధనల ప్రకారం పూర్తి



ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పంటల నష్టాన్ని సర్వే చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువగా పంటలు దెబ్బతింటేనే నష్టంగా పరిగణించాల్సి ఉంటుంది. దీని ప్రకారం సర్వే చేసి నివేదిక అందజేశాం.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ శర్మ


కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,474 మంది హాజరు కాగా, 59 మంది గైర్హాజరయ్యారని, ప్రైవేట్ విద్యార్థులకు ఎనమిది మందికి నలుగురు గైర్హాజరయ్యారని వివరించారు. కలెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపల్, ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారుల సహకారంతో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి పరిశీలకులుగా వచ్చిన ఎస్.శ్రీనివాసాచారి పలు కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. పరీక్షలను విజయవంతం చేసిన 72 కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు డీఈఓ ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టర్ అభినందనలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగియడం పట్ల కలెక్టర్ అనుదీప్ హర్షం వ్యక్తం చేశారు. పరీక్షలు పూర్తయిన సందర్భంగా డీఈఓ సోమశేఖరశర్మ మంగళవారం కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణపై పలు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పూర్తిచేయడం హర్షణీయమన్నారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, పర్యవేక్షకులు జ్యోతి పాల్గొన్నారు.

భానుడి భగభగ!

- జిల్లాలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- రోహిణి కార్తెను తలపిస్తున్న ఎండలు
- వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి



నిర్మానుష్యంగా ఉన్న కొత్తగూడెం – ఖమ్మం ప్రధాన రహదారి



వారం రోజులుగా జిల్లాలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు:

ఏప్రిల్ 5	అశ్వాపురం	39.5
6వ తేదీ	కొత్తగూడెం	39.8
7వ తేదీ	మణుగూరు	40.0
8వ తేదీ	దమ్మపేట	40.2
9వ తేదీ	మణుగూరు	41.4
ఏప్రిల్ 10	దమ్మపేట	41.8
11వ తేదీ	కొత్తగూడెం	43.0

చుంచుపల్లి: భానుడి భగభగలకు జిల్లా అగ్నిగుండంలా మారుతోంది. రెండు రోజులుగా మండుతున్న ఎండలు, వడగాలులతో జిల్లా వాసులు తల్లడిల్లిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం సూర్యుడు నిప్పులు కురిపించాడు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండగా, మధ్యాహ్నం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. సాయంత్రం 7 గంటల వరకూ వేడి తీవ్రత తగ్గడం లేదు. అటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 23 డిగ్రీలు దాటిపోయాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రతకు భయపడి ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మండే ఎండలతో చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు విలవిల్లాడిపోతున్నారు. ఖమ్మం – భద్రాచలం, విజయవాడ – భద్రాచలం జాతీయ రహదారిపై మధ్యాహ్నం వేళ వాహనాల రద్దీ పూర్తిగా తగ్గిపోయింది. ప్రధాన రహదారులపై జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో మంగళవారం భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలకు వేడిగాలులు తోడవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

నిప్పుల కుంపటిలా..

రోహిణి కార్తెకు నెల రోజుల ముందే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. జిల్లాలో మంగళవారం 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో పగటి ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా మంగళవారం అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జిల్లా వ్యాప్తంగా నిప్పుల కుంపటిని తలపించింది. మండుటెండలకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు కూడా ఏర్పడుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో చెమట ఎక్కువగా ఉంటున్నందున ప్రతి ఒక్కరూ రోజుకు నాలుగైదు లీటర్ల నీరు తాగాలని చెబుతున్నారు. శీతల పానీయాలకు బదులు మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని అంటున్నారు. ఎండలో బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన వారు నిమ్మరసం తాగాలని, ఎండ నుంచి ఉపశమనం కోసం కర్బూజ, కీర దోసకాయ, ఇతర పండ్లు తీసుకోవాలని చెబుతున్నారు.

నిప్పుల కుంపటిలా ఉంది



ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత ఇంతగా ఉంటుందని అనుకోలే. రోహిణి కార్తె రాక ముందే సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత, వడగాలులు పెరిగాయి. దీంతో రోడ్ల పక్కన ఉంటున్న మేము వేడికి తట్టుకోలేకపోయాం.

– శంకర్, పూల వ్యాపారి

జాగ్రత్తలు పాటించాలి



ఎండలు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. బయటకు వెళ్లేటప్పుడు టోపీ, రుమాలు, గొడుగు వంటివి ధరించాలి. వేసవి సీజన్‌లో తెల్లటి దుస్తులు వాడడం మంచిది. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీరు తాగాలి. అలాగే మజ్జిక, నిమ్మరసం వంటి చల్లని పానీయాలు తీసుకోవాలి. మధ్యాహ్నం వేళ ఇంటికే పరిమితమై ఉంటే వడదెబ్బ బారిన పడకుండా ఉంటారు.

– నేహా అంజ్రీన్, పెనగడప వైద్యాధికారి

ఫ్రూట్ బ్యాగింగ్‌తో నాణ్యమైన దిగుబడి



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడికాయలను పరిశీలిస్తున్న మరియన్న

అన్నపురెడ్డిపల్లి/చంద్రుగొండ: పండ్ల తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట, చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి తోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఫ్రూట్ బ్యాగింగ్ విధానం వల్ల కాయలు, పండ్లు ఆకర్షణీయంగా ఉంటాయన్నారు. తద్వారా వినియోగదారులు మంచి ధర పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫ్రూట్ బ్యాగింగ్‌కు అందుబాటులో ఉన్న కవర్లు, దిన పత్రికలను కూడా వినియోగించవచ్చని చెప్పారు. జిల్లాలోని దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు మండలాలకు చెందిన రైతులు మామిడి, జామతోటల్లో ఈ విధానాన్ని పాటిస్తూ నాణ్యమైన దిగుబడి సాధిస్తున్నారని వివరించారు. ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి పండ్లను ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు శ్రీధర్, బాలాజీ, మల్లేశ్, కార్యాలయ అధికారి సముద్రాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధిగా గిరిబాబు


గిరిబాబు

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా మాచినేనిపేటతండాకు చెందిన లకావత్ గిరిబాబును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు నియమించారు. ఈ మేరకు మంగళవారం గిరిబాబు వివరాలు వెల్లడించారు. గిరిబాబు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ

అశ్వాపురం: భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీ సెక్యూరిటీ సిబ్బందిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో మంగళవారం మణుగూరు డీఎస్పీ రాఘవేందర్ విచారణ చేపట్టారు. కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు గౌతమీనగర్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణబాబు, మరో నలుగురు సిబ్బంది చారి, సుధాకర్, సురేష్, వెంకటేశ్వర్లుపై అశ్వాపురం పోలీసులు అట్రాసిటీ కేసుతో పాటు 448, 509, 294 బీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ బాధిత మహిళ నివాసంలో విచారించి, ఆమె చెప్పిన వివరాలు నమోదు చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ జితేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా ట్రెంచ్..


జేసీబీతో ట్రెంచ్ తవ్విస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామం వద్ద గోదావరి నుంచి అక్రమార్కులు అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు నదికి వెళ్లే దారిలో మంగళవారం జేసీబీతో ట్రెంచ్ కొట్టించారు. ర్యాంపు వైపు వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు వీఆర్‌ఏలు రాజేష్, వెంకటలక్ష్మి, చంటి, గణేష్ తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం


తల్లీ బిడ్డలతో సిబ్బంది

దమ్మపేట: పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని మొండివర్రె గ్రామానికి చెందిన గర్భిణి కొర్సా నాగమణికి మంగళవారం పురిటి నొప్పులు రాగా 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో పాల్వంచకు తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ములకలపల్లి మండలంలోని జగన్నాథపురం గ్రామంలో అంబులెన్స్ నిలిపివేశారు. 108 మెడికల్ టెక్నీషియన్ రాము, పైలట్ పవన్ ఆమెకు కాన్పు చేశారు. ఆడబిడ్డ జన్మించగా, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మౌనిక (ఫైల్)

దమ్మపేట: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన చల్లా నాగేంద్రబాబుకు మౌనికతో 2011లో వివాహం జరిగింది. దంపతులకు 10 పదేళ్ల కూతురు ఉంది. సోమవారం రాత్రి మౌనిక గుండెపోటుతో చనిపోయిందని ఆమె భర్త స్థానికులకు, మృతురాలి బంధువులకు మంగళవారం తెల్లవారుజామున సమాచారం అందించాడు. కాగా మృతురాలి బంధువులు మౌనిక మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఒంటిపై గాయాలు ఉన్నాయని చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించారు.

మృతురాలి కుటుంబీకుల రాస్తారోకో

అశ్వారావుపేట: మౌనిక మృతిపై అనుమానాలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ అశ్వారావుపేట రింగ్ రోడ్ సెంటర్‌లో కుటుంబీకుల, బంధువులు రాస్తారోకో చేపట్టారు. ఫిర్యాదును మార్చాలంటూ పోలీసులు చెబుతున్నారని ఆరోపించారు. కాగా ఈ ఘటనపై సీఐ బొమ్మెర బాలకృష్ణను 'సాక్షి' వివరణ కోరగా.. ప్రస్తుతం అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. ఫిర్యాదులో మార్పులు కాదని, తప్పులు ఉంటే సరి చేయాలని సూచించి ఉంటారని అన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

అందని సూపర్ స్పెషాలిటీ వైద్యం

జిల్లాలో పేరుకే పెద్దాస్పత్రులు
- రాత్రి వేళల్లో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్న ప్రమాద బాధితులు


పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి

పాల్వంచ: జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మృగ్యంగా మారాయి. పేరుకే జిల్లా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఏదైనా ప్రమాదం జరిగితే సకాలంలో స్పందించే వైద్యులు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. డ్యూటీ డాక్టర్లు ఉన్నా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి. క్షతగాత్రులకు సరైన రిపోర్ట్‌లు, పరీక్షలు చేసే సిబ్బంది కూడా లేరు. జిల్లా కేంద్రం కొత్తగూడెంతోపాటు పాల్వంచ, మణుగూరు, భద్రాచలంలో ప్రధాన ప్రభుత్వ వైద్యశాలలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో చిన్న చిన్న సర్జరీలు, ఆపరేషన్లు మినహా కార్పొరేట్ స్థాయి వైద్యం మాత్రం అందని ద్రాక్షగా మారింది. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అయితే ఇక్కడ సరైన వైద్య సేవలు లేవంటూ ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లాలని చెబుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఏజెన్సీ జిల్లా నుంచి ఖమ్మం, అటు నుంచి హైదరాబాద్‌కు తరలించాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో మార్గంమధ్యలోనే పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో ఓ టిప్పర్ డ్రైవర్ గాయపడ్డాడు. అతడిని పాల్వంచ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిఉండగా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. పాల్వంచ ఆస్పత్రికి తీసుకెళ్లినా వైద్యం అందదనే కారణంతో కొత్తగూడెం తీసుకెళ్లినట్లు కేటీపీఎస్ కార్మికవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే తరహాలో కేసులు ప్రైవేటు, లేదా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ఎస్పీ డాక్టర్ వినీత్


మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు విద్యతోపాటు సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. మంగళవారం వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో స్వేరోస్ భీమ్ దీక్షలో భాగంగా స్వేరోస్ సర్కిల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు శివరంజని ఆధ్వర్యంలో జ్ఞాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. తొలుత పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం పూలే చేసిన పోరాటాలు ఆదర్శనీయమని, సంఘ సంస్కరణలు తీసుకువచ్చే క్రమంలో ఎన్నో సమస్యలను సవాళ్లను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఏడాది వయసులోనే తల్లిని కోల్పోయినా పట్టుదల, కార్యదీక్షతో విద్యనభ్యసించారని, ఆ విద్యను మరెందరికో పంచారని కొనియాడారు. జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయిపూలే మహిళా హక్కులు, విద్యకు కృషి చేశారని అన్నారు. స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి హరిబాబు మాట్లాడుతూ ప్రతి మనిషికి కులం, మతం, లింగభేదం లేకుండా సమాన హక్కులు కల్పించాలని కోరుకున్న మహనీయులు పూలే దంపతులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుదర్శన్, సత్యం, వివేకవర్ధిని, నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎంవీ చౌదరి, సృజన, బూర్గుల కరుణాకర్ పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్ అదృశ్యం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన జవాన్ శ్రీనివాస్ సోమవారం సాయంత్రం క్యాంపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బెటాలియన్ సిబ్బంది ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి బ్రిడ్జి మూడో పిల్లర్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం చర్ల మండలం పుసుగుప్ప అటవీ ప్రాంతంలో చర్ల పోలీసులు, 81 బెటాలియన్, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్ మడవి ఇడుమ, దళ సభ్యురాలు కుంజా దేవీలను అరెస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ గ్రామానికి చెందిన మడవి ఇడుమ 2010లో మావోయిస్టు పార్టీకి చెందిన బాలల సంఘంలో, 2017 నుంచి ఉసూర్ ఎల్‌ఓఎస్ దళ సభ్యుడిగా, 2021 ఏడాది నుంచి ఉసూర్ ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తున్నాడు. బీజాపూర్ పీఎస్ పరిధిలోని ఉసూర్ గ్రామానికి చెందిన కుంజా దేవి 2012 నుంచి ఉసూర్ ఎల్‌ఓఎస్ దళ సభ్యురాలిగా పని చేస్తోంది. వీరిద్దరూ మావోయిస్టు అగ్ర నాయకుల ఆదేశాల మేరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లోని ఆదివాసీలను బలవంతంగా సమావేశాలకు తీసుకెళ్తున్న క్రమంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు పలు విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, చర్ల సీఐ అశోక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డ ముగ్గురు దొంగలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన మాలోతు విక్రమ్, బండారి సాయి తేజ, సురిపాక నాగరాజు చోరీలు చేస్తున్నారని పక్కా సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. భద్రాచలం ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో పట్టుకున్నారు. విచారించగా భద్రాచలం పట్టణంలో దొంగతనాలను చేసినట్లు అంగీకరించారు. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చోరీ కేసుల్లో జైలుకు కూడా వెళ్లి, ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్, మధు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

వీధి కుక్కల స్వైర విహారం

ఏడుగురు చిన్నారులకు గాయాలు


కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు అక్షయ్, చిన్నారి గ్రీష్మశ్రీ

కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి: వీధి కుక్కలు మంగళవారం ఏడుగురు చిన్నారులపై దాడి చేశాయి. టేకులపల్లి మండల పరిధిలోనే వివిధ గ్రామాల్లో ఆరుగురు చిన్నారులను కరిచిగాయపర్చాయి. టేకులపల్లి పోస్టాఫీసు సెంటర్ ముత్యాలమ్మ గుడి సమీపంలో నాలుగేళ్ల చిన్నారి అక్షయ్ నాయక్‌తోపాటు ఏడేళ్ల బాలుడు తోటకూరి ఆయుష్, ఎనిమిదేళ్ల బాలుడు తోటకూరి నవనీత్, సులానగర్‌లో వృద్ధురాలు సంతోషం, బావోజీతండాలో ఐదేళ్ల బాలుడు ప్రణయ్, టేకులపల్లిలో ఆరేళ్ల చిన్నారి సీహెచ్ నిరోషాలపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వీరందరినీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా..

కొత్తగూడెం పట్టణం గొల్లగూడెం ఏరియా రాజీవ్ గృహకల్ప ఏరియాకు చెందిన దురిశెట్టి కుమార్ కుమార్తె గ్రీష్మశ్రీ మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న క్రమంలో వీధి కుక్క కరిచింది. దీంతో బాలిక ముఖం, గొంతుపై గాయాలయ్యాయి. స్థానికులు గమనించి తరిమికొట్టారు. చిన్నారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినట్లు తండ్రి కుమార్ తెలిపారు.

బర్త్ కంట్రోల్ సెంటర్ వద్దే వదిలేస్తున్నారు...

రైటర్‌బస్తీ గొల్లగూడెంలో ఉన్న యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ అనంతరం కుక్కలను అక్కడే వదిలేస్తున్నారని, దీంతో అవి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ రాజీవ్‌గృహకల్ప ఏరియాకు చేరుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులపై దాడి చేస్తున్నాయని పేర్కొంటున్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ వద్ద కుక్కలను వదిలేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మహిళ గొంతులో ఇరుక్కున్న చేప!


సీత గొంతులో ఇరుక్కున్న చేప పిల్లను బయటకు తీస్తున్న డాక్టర్, (ఇన్‌సెట్) బయటకు తీసిన చేప పిల్ల

ఓ మహిళకు చేప చిక్కగా.. ఇంకో చేప కనిపించడంతో మొదటి చేపను నోటితో పట్టుకుని రెండో దాని కోసం యత్నిస్తుండగా గొంతులోకి వెళ్లడంతో ప్రాణాపాయ స్థితి ఎదురైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిజన మహిళ సీత భద్రాచలంలో పట్టణంలోని గోదావరిలో చేపలు పట్టి అమ్ముతూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఆమె ఒక చేపను నోటితో పట్టుకుని, మరో చేపను పట్టే క్రమంలో నోట్లో పెట్టుకున్న చేప గొంతులోకి జారి అడ్డంగా ఇరుక్కుపోయింది. దీంతో ఓ పక్క ముఖం వాపు వచ్చి ఇబ్బంది పడుతుండగా బంధువులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈఎన్‌టీ వైద్యుడు ప్రవీణ్ ఆమె గొంతులో ఇరుక్కున్న చేపను బయటకు తీశారు. సరైన సమయానికి సీతను ఆస్పత్రికి తీసుకుని రావడంతో ప్రమాదం తప్పినట్లయిందని ఆయన తెలిపారు.

– భద్రాచలంఅర్బన్

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఓ మహిళ అదృశ్యంపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన చిలకల మౌనిక నాలుగు రోజుల క్రితం మండల పరిధిలోని నాగారం గ్రామంలోని తన పుట్టింటికి వచ్చింది. ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. మౌనిక సోదరుడు మల్లాది సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు కరోనా పరీక్షలు


విద్యార్థులకు కరోనా పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన ఆశ్రమ క్రీడాపాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యులు సబ్‌సెంటర్‌లో కరోనా ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహించారు. 20 మంది విద్యార్థులకు ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించగా, ఓ విద్యార్థికి జలుబు, దగ్గుతోపాటు కరోనా లక్షణాలు కలిగి ఉండటంతో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష కోసం కొత్తగూడెం ఆస్పత్రికి పంపినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కాగా విద్యార్థులను మండుతున్న ఎండలోనే నిలబెట్టి పరీక్షలు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొమరారం ఎస్సై శివరామకృష్ణ మంగళవారం రాత్రి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల సతీష్ రేషన్ బియ్యం ప్రజల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించి సతీష్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ముష్టిగింజల కొనుగోలుదారుకు జరిమానా


స్వాధీనం చేసుకున్న ముష్టిగింజలు

గుండాల: గిరిజనులు సేకరించిన ముష్టిగింజలను కొనుగోలు చేస్తున్న ఓ దళారిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కరకగూడెం మండలానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి గుండాల మండలం కొడవటంచ గ్రామంలో ముష్టిగింజలను కొనుగోలు చేస్తున్నాడు. సమాచారం అందడంతో పోలీసులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అతని నుంచి 50 కేజీల ముష్టిగింజలను స్వాధీనం చేసుకుని,రూ.9,600 జరిమానా విధించామని పేర్కొన్నారు. గిరిజనులు అటవీ ఉత్పత్తులను జీసీసీల్లోనే విక్రయించాలని సూచించారు.

భూకబ్జాలపై విచారణకు సిద్ధమా?

- ఎమ్మెల్యే దంపతులవి వ్యాపార రాజకీయాలు
- జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

ఇల్లెందు: నియోజకవర్గంలో భూకబ్జాలపై ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు విచారణకు సిద్ధమేనా అని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సవాల్ విసిరారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, ఆయనకు సంఘీభావంగా కొత్తగూడెం ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును బీఆర్‌ఎస్ సస్పెండ్ చేయగా.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అధిష్టానం మెప్పు కోసం అతిగా స్పందించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో గెలిచి టీఆర్‌ఎస్‌కు అమ్ముడుబోయిన ఎమ్మెల్యే దంపతులు భూకబ్జాలపై విచారణకు రావాలని సూచించారు. సింగరేణి నిర్వాసితుల స్థలంలో భవనం నిర్మించడమే కాక టేకులపల్లిలో సింగరేణి కాలనీ వద్ద ఆస్పత్రి నిర్మాణానికి స్థలం ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే దంపతులు వ్యాపార రాజకీయాలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ పొంగులేటితో పాటు తనను చదువు లేని వారని విమర్శిస్తున్నారని.. రాజకీయాల్లో డబుల్ పీజీలు కాదు నీతి, నిజాయితీ అవసరమని చెప్పారు. కాగా, ఇటీవల తన గన్‌మెన్లను తొలగించడమే కాక భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి కల్యాణానికి వీఐపీ పాస్ కూడా ఇవ్వలేదన్నారు. ఈసమావేశంలో కౌన్సిలర్ పత్తి స్వప్న, సర్పంచ్‌లు పాయం స్వాతి, లలిత, తాటి చుక్కమ్మ, కవిత, ఉమ, బోడ నిరోషాతో పాటు మండల రాము, సురేందర్, కృష్ణప్రసాద్, యశోద, రజిని, శారద, పూర్ణ, ఎల్లయ్య, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజీనామా చేసి మాట్లాడాలి..


మాట్లాడుతున్న హరిసింగ్ నాయక్

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియపై అసత్య ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తొలుత బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన పదవికి రాజీనామా చేయాలని మార్కెట్ మాజీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదవీ వ్యామోహంతో చైర్మన్ హోదాలో కొనసాగుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ప్రజల కోసం నిర్మించిన ప్రజా వైద్యశాలలో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని చెప్పారు. ఈసమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాధవరావు, సత్యనారాయణ, కిషన్‌నాయక్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, మనోహర్, శ్రీనివాస్, హరికృష్ణ, రవి, సుధీర్‌తోత్లా తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆర్డీఓ భర్త ఆత్మహత్య

అమీర్‌పేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆర్డీఓ భర్త మంగళవారం హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కథనం ప్రకారం.. భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి, ఎస్.వి.చంద్రశేఖర్(58)దంపతులు హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌నగర్ ఠాణా పరిధి బాపూనగర్‌లో ఉన్న సాయి కృప అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ బీ–2లో నివాసం ఉంటున్నారు. వీరికి 30 ఏళ్ల క్రితం వివాహం కాగా కుమారుడు పృథ్వీరాజ్ ఉన్నాడు. అతను అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. కాగా చంద్రశేఖర్ ఐదారేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స కూడా చేయిస్తున్నారు. భార్యాభర్తలు మంగళవారం తెల్లవారుజామున కొత్తగూడెం నుంచి బాపూనగర్‌కు వచ్చారు. నాంపల్లిలోని లోకాయుక్త కోర్టులో పని ఉండటంతో ఉదయమే రత్నకల్యాణి వెళ్లి పోగా చంద్రశేఖర్ ఒక్కరే ఇంట్లో ఉన్నాడు. ఆమె మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి వచ్చేసరికి.. చంద్రశేఖర్ డైనింగ్ హాల్లో సీలింగ్ ఫ్యాను కొక్కానికి దుప్పటితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో రత్నకల్యాణి ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చంద్రశేఖర్ గతంలో మూడుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై ప్రదీప్ తెలిపారు.

పేలుడు సామగ్రి పట్టివేత


పట్టుబడ్డ పేలుడు సామగ్రితో పోలీసులు

బూర్గంపాడు: అంజనాపురం గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున బూర్గంపాడు పోలీసులు భారీగా పేలుడు సామగ్రి పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు ఎస్సై సంతోష్ తమ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అంజనాపురం దర్గా సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. పోలీస్ వాహనం చూసిన వారు అక్కడ్నుంచి పరారయ్యారు. దర్గా సమీపంలో పోలీసులు తనిఖీ చేయగా భారీగా పేలుడు సామగ్రి దొరికింది. 148 ఐరన్ పైపులు, రేడియో, వీహెచ్‌ఎఫ్ సెట్ లభ్యమయ్యాయి. సమాచారమందుకున్న పాల్వంచ సీఐ నాగరాజు కూడా ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

చుంచుపల్లి: కొత్తగూడెంలోని పలు ఆస్పత్రులు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, ఎండి. ఫయాజ్ మోహిద్దీన్, నాగలక్ష్మి, అన్నమేరీ, ఇనోక్, విజయ్ కుమార్, బేబీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనకు జై

- ఏపీలో నిర్వహించేందుకు సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం



సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలన్న బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జైకొట్టింది. వెనుకబడిన వర్గాల ఆశల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. వీరి న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా సీఎం వారికి నైతిక మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ తాజా నిర్ణయంపట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్త జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసింది. పైగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలో కుల గణనకు సన్నద్ధమైంది. దీనిపై అధ్యయనానికి రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం వెల్లడించారు. త్వరలో మంత్రి వేణు నేతృత్వంలో కమిటీని కూడా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బిహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం రాష్ట్రంలో బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో సింగరేణి అధికారుల భేటీ

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన సింగరేణి అధికారుల బృందం మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముడి సరుకులు, నగదు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈవోఐకు ఈ నెల 15న గడువుగా నిర్ణయించారు. ఈవోఐలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుందన్న వార్తల నేపథ్యంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, బలరాంతో పాటు మరో ఇద్దరు జీఎంలు ఉక్కు పరిపాలన భవనంకు వచ్చారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాలరావు, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏకే బాగ్చీ, మార్కెటింగ్ అధికారులతో సమావేశమై ఈవోఐ విధి విధానాల గురించి చర్చించినట్లు సమాచారం.

అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే! 'కల్తీ' కల్లోలం!

ఆర్బీఐ వారించినా రామోజీ బుద్ధి వంకరే


సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడటంలో తనకు సాటిలేదని చెరుకూరి రామోజీరావు మళ్లీ మళ్లీ నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించడమే కాకుండా తన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకునేందుకు బరితెగించడం ఆయనకే చెల్లింది. తటస్థుల ముసుగులో టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడిస్తూ మరో నాటకానికి తెర తీశారు. డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని ఆర్బీఐ కొరడా ఝుళిపించడం, అడ్డంగా దొరికిపోవడంతో కేసు విచారణ ఇంకా కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో నాడు 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ను రామోజీ మూసివేశారు. ఇక ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట రోజుల రూపంలో అక్రమ డిపాజిట్ల సేకరణకు బరితెగించారు. చందాదారుల సొమ్ముతో అక్రమ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాలతో ఈ అక్రమాల బాగోతం మరోసారి బట్టబయలైంది.

మార్గదర్శివి అక్రమ డిపాజిట్లే...

'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట చెరుకూరి రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరించారని ఆర్బీఐ తేల్చింది. ఈమేరకు 2006 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖకు లిఖితపూర్వకంగా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ ద్వారా వెల్లడించింది. డిపాజిట్ల సేకరణను సమర్థించుకుంటూ రామోజీరావు చేసిన వాదన పూర్తిగా అహేతుకం, చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆదాయపన్ను చట్టం ప్రకారం తమ వ్యాపార సంస్థలన్నీ హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కిందకు వస్తాయి కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చని, ఆర్బీఐ చట్టంలోని '45 ఎస్' నిబంధన తమకు వర్తించదని రామోజీ అడ్డగోలుగా వాదించారు. దీన్ని ఆర్బీఐ పూర్తిగా తిరస్కరించింది. 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది.

కొత్తగా సేకరించొద్దు.. రెన్యువల్ చేయొద్దు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు రూ.2,204.42 కోట్లు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారని ఆర్బీఐ వెల్లడించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తక్షణం డిపాజిట్ల సేకరణను నిలిపివేయాలని ఆదేశించింది. కొత్తగా డిపాజిట్లు సేకరించడం, కాలపరిమితి ముగిసిన పాత డిపాజిట్లు రెన్యూవల్ చేసేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రామోజీరావు డిపాజిట్ల సేకరణను నిలిపివేశారు. అప్పటికే సేకరించిన రూ.2,204.42 కోట్లను డిపాజిట్‌దారులకు వెనక్కి ఇచ్చేస్తామని ఆర్బీఐకి లిఖితపూర్వకంగా తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో తమ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసివేశారు. నాడు దివంగత వైఎస్సార్ సకాలంలో స్పందించి 2.50 లక్షల మంది డిపాజిట్‌దారులు హక్కులను పరిరక్షించారు.



RESERVE BANK OF INDIA

To Govt. Of Andhra Pradesh, 29.12.2006

Chief General Manager in Charge
D.O.DNBS CO/01.02.007/2006-07 November 30, 2006

Dear Shri Amitabh Verma

Representation of Sri Vundavalli Arun Kumar, M.P. received through Dr. Y.S. Rajasekhara Reddy, Chief Minister, Andhra Pradesh regarding alleged irregularities being committed by Margadarsi Financiers, Hyderabad based HUF.

Please refer to Government's letter F.No 5/94/2006-BO.II dated November 10, 2006 on the captioned subject.A Status paper indicating the background in respect of Margadarsi Financiers is given in Annex.

2. In view of the letter under reference received from the Ministry, the Bank had called the representative of the unincorporated body (UIB) of discussion on November 13, 2006 and they were asked to a) Substantiate their stance that they are not covered under Section 45S of the RBI Act, 1934 and b) detail their plans for protection of the interest of the depositors. Pending submission of the replies, the UIB was advised neither to accept any fresh deposit nor renew the maturing deposits forthwith.

మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల సేకరణ అక్రమం అని చెబుతూ ఆర్‌బీఐ కేంద్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖ... డిపాజిట్ల సేకరణ నిలిపివేయాలి, డిపాజిట్‌దారులకు డిపాజిట్ మొత్తానికి తిరిగి చెల్లించాలని ఆదేశించినట్టు పేర్కొన్న ఆర్‌బీఐ

2006లో ఆర్బీఐ ఏం చెప్పిందంటే..?

- 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'వి కచ్చితంగా అక్రమ డిపాజిట్లే
- నిబంధనలకు విరుద్ధంగా రూ.2,205 కోట్ల డిపాజిట్ల సేకరణ
- డిపాజిట్‌దారులకు తక్షణం డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలి
- కొత్తగా డిపాజిట్ల స్వీకరణ, పాతవి రెన్యువల్ చేయకూడదు

మళ్లీ అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్బీఐ ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ దుకాణాన్ని మూసివేసిన రామోజీ ఈసారి మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమ డిపాజిట్లకు తెరతీశారు. చందాదారులు పాడిన చిట్టీ మొత్తాన్ని వారికి పూర్తిగా చెల్లించకుండా రోజుల రూపంలో డిపాజిట్లుగా వసూలు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు వసూలు చేయడం చిట్‌ఫండ్ చట్టం -1982కు విరుద్ధం. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల నుంచి అక్రమ డిపాజిట్లను సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి తమ అనుబంధ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)–చెన్నై, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)–బెంగళూరులలో అక్రమ పెట్టుబడులు పెట్టారు. ముంబైలోని మ్యూచ్‌వల్ ఫండ్స్ కంపెనీలు, షేర్ మార్కెట్లో కూడా అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. ఇలా తన చేతి సొమ్ము రూపాయి పెట్టకుండా చందాదారుల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి ఆస్తులు కూడగట్టారని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైంది.



A LETTER FROM
RBI (Central Office) MUMBAI
to A.P Government.

Copy of of letter No. DNBS.CO. 4230/01.02.06-2007 dated 29th December 2006 of from Sri P. Krishnamurthy, Chief General Manager-in-Charge, Reserve Bank of India, Central Office, Mumbai addressed to Sri Paul Bhuyan, IAS, Special Chief Secretary to Government, Home Department, Government of Andhra Pradesh, A-Block, 3rd Floor, Secretariat, Hyderabad.

Dear Sir,

Please refer to your letter No. 37008/General.B/A2/2006-1 dated December 19, 2006 requesting certain information / documents etc. on Margadarsi Financiers, Hyderabad.

2. As you may be aware, the Reserve Bank of India draws its powers for regulation and supervision over the non-banking financial companies (NBFCs) from the provisions of Chapter III B of the Reserve Bank of India Act, 1934/ These powers include registration of NBFCs, inspecting their business, calling for information, calling for returns/statements on deposits and issuing directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions or exercise other regulatory and supervisory powers as regards unincorporated bodies (UIBs) such as Margadarsi Financ' which is stated to belong to a Hindu Undivided Family (I 31 Since HUFs are not falling within the definition of a NBFC non-banking Insitution under Chapet III B of the RBI Act, 1934.

డిపాజిట్ దారుల ప్రయోజనాల పరరక్షణ కోసం సీఐడీ ద్వారా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఆర్‌బీఐ రాసిన లేఖ

చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనన్న ఆర్బీఐ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్బీఐ 2006లోనే స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ పెట్టుబడుల అంశంపై నాడు ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తేవడంతో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అక్రమ డిపాజిట్లు వసూలు చేసే ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం ఆర్బీఐకి ప్రత్యేకంగా లేదని పేర్కొంది. ఆ తరహా ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సీఐడీ విభాగం ప్రత్యేకంగా ఉందని ఆర్బీఐ ప్రస్తావించడం గమనార్హం. ఆమేరకు ఏపీ ప్రభుత్వం కూడా 1999 రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు ఆర్బీఐ ఆదేశాలతోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చర్యలు చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై అదే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటోంది. సోదాలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

▶ మొదటి పేజీ తరువాయి

108 అంబులెన్స్‌లో బంధువులు అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఐసీయూలో చికిత్స పొందుతూ ఆశన్న తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. వైద్యులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. అతడి తమ్ముడు బెంగళూరు నుంచి వచ్చేసరికి సమయం పట్టడంతో మంగళవారం దహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు, ఎక్సైజ్‌శాఖ గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరో ఇద్దరు ఐసీయూలో..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీయూలో మరో ఇద్దరు కల్తీ కల్లు బాధితులు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన విష్ణుబాబు భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో పోస్టల్ శాఖలో ఏబీపీఎంగా చేస్తున్నాడు. ఆయనతో పాటు దొడ్డలోనిపల్లి గ్రామానికి చెందిన రేణుక ఐసీయూలో చికిత్స పొందుతోంది.



మృతుడు ఆశన్న

విష్ణుబాబుకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా.. పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. దొడ్డలోనిపల్లికి చెందిన రేఖతో పాటు మరో ఆరుగురికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

ఆల్ప్రాజోలం మోతాదులో తేడా వల్లేనా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మందు కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కల్లులో ప్రధానంగా నిషేధిత మత్తు పదార్థం ఆల్ప్రాజోలంను కలుపుతున్నారు. అయితే మోతాదులో తేడా రావడం వల్లే బాధితులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన అందరిలో మెడ తిమ్మిర్లు, చేతులు వణకడం, తలవెనక్కి వాలడం, నాలుక బయటకు రావడం, నత్తి, శరీరంలో చలనం లేకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తున్నాయి.

ఎవరూ కల్లు తాగి అడ్మిట్ కాలేదు..

కల్తీ కల్లు తాగి ఆస్పత్రిలో ఎవరూ అడ్మిట్ కావడం లేదు. కేవలం వింత వింత ప్రవర్తనతో పాటు ఫిట్స్ ఇతర సమస్యలతో వస్తున్నారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు దాదాపు 25 మంది వరకు ఇలాంటి లక్షణాలతో అడ్మిట్ అయ్యారు. వీరిలో కొందరికి ఊపిరితిత్తుల సమస్యతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారించాం. అందరికీ కావాల్సిన చికిత్స అందించి డిశ్చార్జి చేయడం జరుగుతుంది.

– డాక్టర్ రామకిషన్,
జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఐదురోజులుగా ఆస్పత్రిలోనే..



మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఇంద్రజ ఈ నెల 7న కల్లు తాగి అస్వస్థతకు గురికావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. ఆమె మాట్లాడలేని స్థితిలో ఉంది. సపర్యలు చేస్తున్న ఆమె తల్లి మాట్లాడుతూ.. 'ఐదు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నాం..ఇంద్రజకు కల్లు తాగే అలవాటు ఉంది.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో ఆస్పత్రికి తీసుకొచ్చాం..' అని తెలిపింది.

రాష్ట్రంలో భారీగా కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో జ్వరాలు, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరగటం, తదితర కారణాలతో కరోనా కేసులు కూడా పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మంగళవారం 6,813 మందికి పరీక్షలు నిర్వహించగా..వారిలో 40 మంది కరోనా బారిన పడ్డారు. 196 మంది ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కమ్యూనిస్టు నేత వెంకటయ్య కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సీనియర్ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య (98)మంగళవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన ప్రముఖ కమ్యూనిస్టు బొమ్మగాని ధర్మభిక్షం సోదరుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ తండ్రి. వెంకటయ్య భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 8 గంటల వరకు ఎల్బీనగర్ లోని ఆయన కుమారుడు నాగభూషణం నివాసంలో సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం సూర్యాపేటకు తరలించి మధ్యాహ్నం రెండు గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

13న మెగా జాబ్ డ్రైవ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యాన ఈనెల 13న మెగా జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.హవీలా, కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి తెలిపారు. టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతో పాటు విప్రో, ముత్తూట్ ఫైనాన్స్ తదితరుల కంపెనీల బాధ్యులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి 2019 - 2022 సంవత్సరాల మధ్య డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లు ఫొటో, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 99490 55604 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి 16న పరీక్ష

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, 1,670మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కాగా, 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి 12గంటల వరకు, 7నుండి 10వ తరగతిలో ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష..

ఖమ్మంమయూరిసెంటర్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఈనెల 16న పరీక్ష నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యూష తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తెలంగాణ గురుకులాల వెబ్‌సైట్ నుండి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, ఉదయం 11నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

బుగ్గపాడులో పామాయిల్ సబ్ సెంటర్

సత్తుపల్లిరూరల్: రైతుల ఇబ్బందులు తీర్చేందుకు పామాయిల్ సబ్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. గతంలో సత్తుపల్లిలో సెంటర్ ఉండగా.. రైతులకు మరింత చేరువ చేసేందుకు మండలంలోని బుగ్గపాడులో ఇంకోసెంటర్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. బుగ్గపాడు, నాగుపల్లి, నాచారం రైతులు పామాయిల్ గెలలను ఇక్కడ దింపితే, నేరుగా ఫ్యాక్టరీకి వెళ్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు నాయుడు రాధాకృష్ణ, కృష్ణారావు, అప్పారావుతో పాటు రైతులు శివబాబు, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

జేపీఎస్‌ల్లో చిగురిస్తున్న ఆశలు

- ముగిసిన నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్
- క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు
- వివరాల సేకరణలో నిమగ్నమైన అధికారులు
- రెగ్యులరైజ్ చేస్తే ఉమ్మడి జిల్లాలో 818 మందికి లబ్ధి



ఖమ్మం సహకారనగర్: ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కొన్నేళ్ల క్రితం కొత్తగా గ్రామపంచాయతీలను ఏర్పాటుచేసింది. ఈక్రమంలోనే వందలాది మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. పాలకవర్గాలకు తోడు వీరి కృషితో పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఇతర సేవలు అందుతుండగా పల్లెలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి. అయితే, కొన్నేళ్ల క్రితం నియమించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ మంగళవారంతో ముగిసింది. దీంతో క్రమబద్ధీకరణకు వీరు ఆశతో ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం వివరాలు సేకరిస్తున్న నేపథ్యాన త్వరలోనే శుభవార్త వస్తుందని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,070 జీపీలు

ఖమ్మం జిల్లాలో 20 మండలాలు, 589 గ్రామపంచాయతీలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21మండలాలకు గాను 481 జీపీలు ఉన్నాయి. వీటి పరిధిలో నాటి లెక్కల ప్రకారం ఒక్కో పంచాయతీ కార్యదర్శి నాలుగు నుంచి ఏడు పంచాయతీల విధులు నిర్వర్తించేవారు. దీంతో 2019 సంవత్సరం ఫిబ్రవరిలో పాలకవర్గాలు ఏర్పడగా... ఏప్రిల్‌లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లను నియమించింది. తొలుత వీరికి ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్లుగా నిర్ణయించగా... ఆ తర్వాత మరో ఏడాది పెంచింది. ఈ కాల పరిమితి మంగళవారంతో ముగిసింది. తొలిరోజుల్లో రూ.15వేల వేతనం అందుకున్న వీరికి ప్రస్తుతం సుమారు రూ.29వేలు వస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గ్రామాలు, కార్యదర్శుల వివరాలు

వివరం	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
మండలాలు	20	21
గ్రామపంచాయతీలు	589	481
గ్రేడ్ - 1, 2, 3, 4 కార్యదర్శులు	105	102
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు	463	355
ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు	21	24

డీపీఓలకు ఆదేశాలతో ఆనందం

జేపీఎస్‌ల ప్రొబేషనరీ పీరియడ్ మంగళవారంతో ముగియనుండగా కొన్నాళ్లుగా క్రమబద్ధీకరణపై చర్చ జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు కూడా ప్రకటన వెలువడలేదు. ఇంతలోనే జిల్లాల్లోని జేపీఎస్‌ల సమగ్ర వివరాలను పంపించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ విషయం తెలిసిన జేపీఎస్‌ల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తే తాము కన్న కలలు సాకారం అవుతాయని వారు భావిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించగా కమిషనర్ కార్యాలయం సూచనల మేరకు వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ఆందోళన చేయాలా, వద్దా

క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కానీ కమిషనర్ కార్యాలయం నుంచి వివరాలు సేకరిస్తుండడంతో క్రమబద్ధీకరణపై ఆశలు కలుగుతున్నాయి. ఈ నేపథ్యాన ఆందోళనలు చేయాలా, వద్దా అనే మీమాంసలో కార్యదర్శులు ఉండిపోయారు.

బొగ్గు దుమ్ము లేకుండా చర్యలు చేపట్టండి

సత్తుపల్లిరూరల్: సింగరేణి సైలో బంకర్ల ద్వారా రైల్వే వ్యాగన్లలో బొగ్గు నింపే క్రమాన దుమ్ము లేవకుండా నీళ్ల స్ప్రే చేయాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని జేవీఆర్ ఓసీ కోల్ రిసీవింగ్ సెంటర్, కన్వెన్షనల్ బంకర్లు, జీకేఆర్ వ్యూ పాయింట్, సైలో బంకర్‌ను జీఎంలు ఎస్.సుధాకర్, హబీబ్ హుస్సేన్, నారాయణరావు, స్వామినాయుడుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా బొగ్గు దుమ్ము లేవకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని ఆదేశించారు. ఏజీఎం సూర్యనారాయణ, పీఓ ఎస్.వెంకటాచారి, ఏజీఎం రఘురామిరెడ్డి, బి.శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, సోమశేఖర్‌రావు, పి.నర్సింహారావు, మధుసూదన్, రమణారెడ్డి పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం



లక్ష్మయ్య (ఫైల్)

ఖమ్మం అర్బన్: ఖమ్మం విద్యానగర్ కాలనీకి చెందిన మంద లక్ష్మయ్య(60) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా బ్రెయిన్ డెడ్ అయింది. జీవన్‌దాన్ ఫౌండేషన్ సభ్యుల వినతితో కుటుంబ సభ్యులు లక్ష్మయ్యను హైదరాబాద్ తీసుకెళ్లి అవయవదానం చేశారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని మంగళవారం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అవయవదానానికి అంగీకరించిన లక్ష్మయ్య భార్య చిట్టెమ్మ, కుమారుడు హరీష్, కుమార్తె హరితకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేయగా, మంగళవారం ఉదయం పరీక్షకు 285మందిలో 275మంది, మధ్యాహ్నం పరీక్షకు 339మందిలో 328మంది హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

అశ్వాపురం: భద్రాచలం నుంచి అశ్వాపురం మండలంలోని మిట్టగూడెం గ్రామానికి తరలించిన గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక మెరుగైన బోధన అందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గౌతమ్ పొట్రు ఆదేశించారు. మిట్టగూడెంలోని గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను పీఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదులు, డార్మెటరీ, వంటశాలను పరిశీలించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా సౌకర్యాలు కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. కళాశాల ఎదురుగా ఉన్న పాఠశాల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడిన ఆయన శ్రద్ధగా చదువుకుంటూ పోటీ పరీక్షల్లో రాణించాలని తెలిపారు.

కార్పొరేట్‌కు కళాశాలలకు దీటుగా...

మణుగూరుటౌన్: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గిరిజన విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నిష్ణాతులైన అధ్యాపకులతో కళాశాలల్లో బోధన చేయిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. మణుగూరు మండలం గుట్టమల్లారం సమీపాన ఉన్న టీటీడబ్ల్యూఆర్‌జేసీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇక్కడ రూ.2.70కోట్లతో 16తరగతి గదులు నిర్మించనుండగా అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ప్రిన్సిపాళ్లు స్వప్నకుమారి, పద్మావతి, ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వర్లు, సర్వేయర్ తిరుపతయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



అశ్వాపురం : విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

పురోహిత క్రికెట్ టోర్నీలో ఖమ్మం విజయం

ఖమ్మంగాంధీచౌక్: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి పురోహిత క్రికెట్ టోర్నీని ఖమ్మం స్తంభాద్రి జట్టు కైవసం చేసుకుంది. ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన టోర్నీలో 12 జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో కాకినాడ జట్టుతో తలపడిన స్తంభాద్రి జట్టు విజయం సాధించింది. ఖమ్మం జట్టు కెప్టెన్‌గా అవధానుల సాయినాథ్‌శర్మ వ్యవహరించారు. జట్టులోని కనిష్క మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ సిరీస్, నరేష్ ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను స్తంభాద్రి పురోహిత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌శర్మ, కృష్ణశర్మతో పాటు సరస్వతిభట్ల శ్రీధర్‌శర్మ, సీతారామశాస్త్రి, జగన్నాథ్‌శర్మ, ఆమంచి సురేష్‌శర్మ తదితరులు అభినందించారు.



ట్రోఫీతో ఖమ్మం స్తంభాద్రి పురోహిత జట్టు

పెద్దాస్పత్రిలో సంబురాలు

ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ నుండి అనుమతి వచ్చిన నేపథ్యాన మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సంబురాలు నిర్వహించారు. ఈ ఏడాది నుంచే 100సీట్లు భర్తీ చేసేందుకు అనుమతి జారీ చేశారు. దీంతో ఆస్పత్రి అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వీట్ తినిపించుకున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

– ఖమ్మం వైద్యవిభాగం